
ABN ఆంధ్రజ్యోతి కి
23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజానీకానికి,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
దీపావళి పర్వదిన
శుభాకాంక్షలు
మాధవనేని రఘునందన్ రావు, మెదక్ పార్లమెంట్ సభ్యులు

ఉపాధి పనులలో రూ.70 వేల రికవరీ


ప్రజావేదిక సమావేశంలో అధికారులు

రేగోడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులలో జరిగిన అక్రమాలపై రూ.70 వేలు రికవరీ చేయడంతో పాటు, రూ.2 వేలు జరిమానాలు విధించినట్లు అడిషనల్ డీఆర్‌డీవో రంగాచారి తెలిపారు. శనివారం రేగోడు మహిళా సమైక్య భవనంలో ఉపాధి హామీ ప్రజావేదిక సమావేశం జరిగింది. గ్రామాల వారీగా జరిగిన పనులపై నివేదికలు అందించారు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు 18 గ్రామ పంచాయతీలలో రూ.3.12 కోట్ల నిధులతో ఉపాధి పనులు జరిగాయి. ఈ పనులపై జరిపిన తనిఖీల్లో అక్రమాలు జరిగినట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. ఉపాధి సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు రూ.70 వేలు రికవరీతో పాటు రూ.3 వేలు జరిమానాలు చెల్లించాలని అధికారులు ఆదేశించారు. ఉపాధి పనులను పకడ్బందీగా నిర్వహించాలని, అవకతవకలకు తావివ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్ రెడ్డి, సోషల్ ఆడిట్ పీఈ సంపత్ కుమార్ ఆచార్య, ఎస్‌ఆర్‌పీ నాగరాజు, ఎంపీడీవో సీతారావమ్మ, ఏపీవో జగన్మోహన్ సింగ్, ఈసీ జగదీశ్వర్, టీఏలు శ్రీనివాస్, అశోక్, విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

● ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య


వంటలను పరిశీలిస్తున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

చేగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనముతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం చేగుంటలోని తెలంగాణ ఎస్టీ స్పోర్ట్స్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏవైనా సమస్యలు ఉంటే ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, తమకు నేరుగా లేదా ఫోన్ ద్వారా సమాచారమిస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం కిచెన్ షెడ్, కూరగాయల స్టోర్ రూమ్, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీ పాఠశాలలు, వసతి గృహాల్లో, గురుకులలో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు విద్యార్థులకు అందే విధంగా చూడాలన్నారు. మెనూ ప్రకారం భోజనం విద్యార్థులకు అందించే విధంగా జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఉపాధ్యాయులు, వార్డెన్లకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఏఎస్‌డబ్ల్యూవో లింగేశ్వర్, తహసీల్దార్ శివప్రసాద్, ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి, బీసీ హాస్టల్ వార్డెన్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

రేపు వ్రెస్లింగ్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జూనియర్ కాలేజీల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉమ్మడి జిల్లా వ్రెస్లింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్టు సెక్రటరీ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440686408 నంబరును సంప్రదించాలని కోరారు.

బాలికను మోసం చేసిన యువకుడికి రిమాండ్

రాయపోల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. రాయపోల్ మండలం ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పరిచయం చేసుకొని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబర్చుకున్నాడు. పెళ్లి చేసుకోమని ఆ అమ్మాయి అడిగితే నిరాకరించడంతో, ఆమె తల్లికి చెప్పింది. వెంటనే రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మానస తెలిపారు.

లోకచంద్ర మృతదేహం లభ్యం

● 18 రోజుల తర్వాత్త వెండికోలు శివారులో ఆచూకీ


అల్లె లోకచంద్ర (ఫైల్)

పుల్కల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చౌటకూరు మండలం శివంపేట సమీపంలోని మంజీర నది వంతెనపై నుంచి వరద నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన అల్లె లోకచంద్ర మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణానికి చెందిన అల్లె లోకచంద్ర (31) 'క్లింకార' యూట్యూబ్ ఛానల్‌కు సీఈఓగా పనిచేస్తూనే, మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం, లాడ్జీల నిర్వహణ చేస్తున్నాడు. మండలంలోని వెండికోలు గ్రామానికి చెందిన సిరిపురం లక్ష్మణ్ సెప్టెంబరు 28న లోకచంద్ర నిర్వహిస్తున్న లాడ్జిలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటనపై సంగారెడ్డి రూరల్ పోలీసులు లోకచంద్రను ప్రత్యక్ష సాక్షిగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడంటూ లోకచంద్ర తన భార్యకు ఆడియో రికార్డును వాట్సాప్ ద్వారా పంపి సెప్టెంబరు 30న మంజీర నది వంతెన పై నుంచి దూకి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు.

మత్స్యకారుల సమాచారంతో...

శుక్రవారం ఉదయం నదిలోకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు నది తీర ప్రాంతంలో నడుం భాగం వరకు మట్టిలో కూరుకుపోయి కుళ్లిపోయిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పుల్కల్ ఎస్ఐ విశ్వజన్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను రప్పించారు. భార్య ప్రియ, ఇతర కుటుంబ సభ్యులు చేతికి ధరించిన కడియం, గడియారం ఆధారంగా మృతదేహం లోకచంద్రదేనని గుర్తించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి జోగిపేటకు తరలించారు.

మృతదేహంతో ఆందోళన

జోగిపేట రూరల్ : తమ కొడుకు ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలంటూ మృతుడి తల్లి ప్రమీల, కుటుంబ సభ్యులతో కలిసి దర్నా సంగారెడ్డి జిల్లా జోగిపేట తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సముదాయించి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహింపజేశారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు


విజేతగా నిలిచిన కబడ్డీ బాలురు మెదక్ జట్టు

పటాన్‌చెరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో అన్ని రకాల క్రీడలకు పటాన్‌చెరును వేదికగా మార్చడమే లక్ష్యంగా విభిన్నమైన పోటీలు నిర్వహించనున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మైత్రీ మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. అండర్-14 కబడ్డీ బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ ప్రథమం స్థానం దక్కించుకోగా, ఖమ్మం ద్వితీయం , నల్గొండ తృతీయం, వరంగల్ జిల్లా నాల్గవ స్థానంలో నిలిచాయి. అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో మెదక్ ప్రథమం, నల్గొండ ద్వితీయం, రంగారెడ్డి తృతీయం, మహబూబ్‌నగర్ జిల్లా నాల్గవ స్థానం దక్కించుకున్నాయి. అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో ఖమ్మం ప్రథమం, వరంగల్ ద్వితీయం, రంగారెడ్డి తృతీయం, మహబూబ్‌నగర్ జిల్లా నాల్గవ స్థానంలో నిలిచాయి. అనంతరం విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు కృష్ణంరాజు, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని వీరేష్, జగదీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థిని లక్ష్మీదేవికి పీహెచ్‌డీ


డాక్టర్ లక్ష్మీదేవి

పటాన్‌చెరు రూరల్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని జి. లక్ష్మీదేవిని డాక్టరేట్ వరించింది. రెట్రోవైరల్ వ్యతిరేక మందులు సులువుగా మింగడం కోసం సూత్రీకరణ, అభివృద్ధి, ఘన వ్యాప్తి, తులనాత్మక మూల్యాంకనం, నానోసస్పెన్షన్స్, సెల్ఫ్ నానోఎమల్సిఫైయింగ్ డెలివరీ సిస్టమ్స్‌పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ఫార్మసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాతూరి రఘువీర్ మార్గదర్శనం చేశారు గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది లక్ష్మీదేవిని అభినందించారు.

స్వీపర్.. వైద్యురాలిగా మారి

● గాయంతో సిర్గాపూర్ పీహెచ్‌సీకి వచ్చిన వ్యక్తి
● వైద్యులు లేకపోవడంతో చికిత్స చేసిన స్వీపర్

కల్హేర్/సిర్గాపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ పీహెచ్‌సీలో 24 గంటలూ వైద్య సిబ్బంది ఉండాల్సి ఉన్నా ఏ ఒక్కరూ అందుబాటులో ఉండడంలేదు. దీంతో స్వీపర్ వైద్యం చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. వివరాల్లోకి వెళ్లితే సిర్గాపూర్‌కు చెందిన దేవకతే పండరి(60) పొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గాయంతో పండరి శనివారం సాయంత్రం స్థానిక పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం వచ్చాడు. వైద్య సిబ్బంది లేకపోవడంతో ఆసుపత్రిలో స్వీపర్‌గా పనిచేసే మహిళ గాయాలకు మందు వేసి కట్టు కట్టింది. గతంలోనూ సిర్గాపూర్ పీహెచ్‌సీలో ఇలాంటివి చాలా చోటుచేసుకున్నాయి. అయినా ఉన్నతాధికారులు ఇక్కడి వైద్యులు, సిబ్బందిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. అత్యంత అత్యవసర సేవల విభాగంలో ఒక్కరూ కూడా విధినిర్వహణలో లేకపోవడమేమిటని సిర్గాపూర్ మాజీ ఎంపీటీసీ పీరప్ప, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గాయపడిన పండరిని నారాయణఖేడ్ ఆసుపత్రికి తరలించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌వో అయినా దీనిపై దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేశారు.


విద్యుదాఘాతానికి గురైన వ్యక్తికి వైద్యం చేస్తున్న స్వీపర్

మహిళ మృతదేహం లభ్యం


బాలమణి(ఫైల్)

ములుగు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి తునికి బొల్లారంలోని అయ్యప్ప చెరువులో మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలు వర్గల్ మండలం మినాజీపేట్‌కి చెందిన మంకని బాలమణి (50)గా గుర్తించారు. మహిళ మృతదేహాన్ని నల్లటి కవర్‌లో కప్పబడి, కాలు మడిమే నరికేసి ఉన్నట్లు గుర్తించినట్లు గజ్వేల్ ఏసీపీ నర్సింహులు తెలిపారు. ఇదివరకే గౌరారం పోలీస్ స్టేషన్‌లో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. బాలమణి మృతిగల కారణాలు తెలుసుకునేందుకు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి


మల్లేష్ మృతదేహం

తూప్రాన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి కాలువలో పడి మృతి చెందిన సంఘటన చేగుంట మండల కేంద్రంలోని మక్కరాజుపేట బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నర్సింగ్ మండల కేంద్రానికి చెందిన పోచమ్మల మల్లేశం (45) చేగుంట సమీపంలోని బ్రిడ్జి వద్ద కాలువలో చేపలు పట్టడానికి వచ్చి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కత్తులతో దాడి.. ఒకరికి గాయాలు

జహీరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కత్తితో దాడి చేసిన ఘటనలో ఒక వ్యక్తికి గాయాలైన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్‌ఎంటీ కాలనీలో శనివారం జరిగింది. పట్టణ ఎస్ఐ వినయ్ కుమార్ కథనం ప్రకారం తమిళనాడులోని పరిమళ్ పట్టి ప్రాంతానికి చెందిన పుతురాజు పట్టణంలోని ఐడీఎస్‌ఎంటీ కాలనీలో చిరుతిండ్లు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. ఇదే ప్రాంతంలో తమిళనాడుకు చెందిన మణికంఠ కూడా చిరుతిండ్లను అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం పుతురాజు జహీరాబాద్ పట్టణంలో చిరుతిండ్లను అమ్ముకుని ఐడీఎస్ఎంటీ కాలనీకి వెళ్తున్నాడు. అదే సమయంలో మణికంఠ అడ్డగించి, 'నీవు ఇక్కడ వ్యాపారం చేయొద్దని, నిన్ను చంపితేనే తనకు వ్యాపారంలో ఎలాంటి అడ్డు ఉండదని' అంటూ వెంట తెచ్చుకున్న కత్తితో దాడిచేశాడు. పుతురాజుకు రక్తగాయాలు కాగా, స్థానికులు, కుటుంబీకులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

డబ్బులు వసూలు చేసిన ముగ్గురి అరెస్టు

నర్సాపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం నర్సాపూర్ సమీపంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయుడిని బెదిరించి, అతడి వద్ద ఉన్న డబ్బులు వసూలు చేసి వదిలేసిన ఘటనలో నిందితులను గుర్తించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. గుమ్మడిదల మండలం అన్నారంకు చెందిన ఉపాధ్యాయుడు కిష్టయ్య ఈ నెల 16వ తేదీన ఆటోలో కొల్చారం నుంచి వస్తుండగా, నర్సాపూర్ సమీపంలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు కలిసి బెదిరింపులకు గురిచేసి అతడి వద్ద ఉన్న డబ్బులు వసూలు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో నిందితులు సాయికుమార్, అనిల్, కుమార్ లుగా గుర్తించి, వారిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు గతంలో కూడా పలు నేరాలకు పాల్పడిన కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


భారీగా రేషన్ బియ్యం పట్టివేత

● అక్బర్‌పేట-భూంపల్లిలో 372 క్వింటాళ్లు, రామచంద్రాపురంలో 12 టన్నులు స్వాధీనం

మిరుదొడ్డి/రామచంద్రాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలలో భారీగా రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. పౌర సరఫరాల అధికారి సాయి రవి, సీఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం అర్ధరాత్రి సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలోని లక్ష్మీప్రసన్న రైస్‌మిల్లును సివిల్ సప్లై, ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులోని 372 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ అధిక రేట్లకు మరో రైస్‌మిల్లులకు విక్రయిస్తుండగా వారు పట్టుకున్నారు. ఈ మేరకు రైస్‌మిల్ యజమాని కాపర్తి సంతోష్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పట్టుకున్న పీడీఎస్ సన్నబియ్యాన్ని మంజూనాథ రైస్‌మిల్‌లో భద్రపరిచారు. అలాగే, నగరంలోని రాజేంద్రనగర్ నుంచి కర్ణాటకకు డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న 12 టన్నుల రేషన్ బియ్యాన్ని శనివారం ఉదయం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని ఓఆర్‌ఆర్‌పై కొల్లూరు పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు మహమ్మద్ షమీని అదుపులోకి తీసుకున్నారు. పౌర సరఫరాల అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోడలు పట్టించుకోవడంలేదు..

● కొడుకు ఆస్తులను మార్చేసుకుంది
● భోజనానికి, మందులకు ఇబ్బందులు
● తూప్రాన్ ఆర్డీవోను ఆశ్రయించిన వృద్ధ రైతు


తూప్రాన్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న చంద్రారెడ్డి

తూప్రాన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 'వ్యవసాయ భూములమ్మి ఆస్తులు కొన్నాం. అవన్నీ కొడుకు పేరిట ఉండటంతో ఆస్తులను కోడలు తన పేరిట మార్చుకుంది. అనారోగ్యం బారిన పడిన భర్తను పట్టించుకోలేదు. చనిపోతే దహన సంస్కారాలకు హాజరు కాకపోగా, వైద్యం చేయించిన సోదరికే ఎగనామం పెట్టింది. మామకు కనీసం ఆసుపత్రి ఖర్చులు ఇవ్వకపోగా, భోజనం కూడా పెట్టడంలేదు. అధికారులు స్పందించి ఆస్తులను తన పేరా మార్పిడి చేయాలి' అంటూ ఓ 75 ఏళ్ల వృద్ధ రైతు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం యావాపూర్‌లో చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. యావాపూర్‌కు చెందిన శేరి చంద్రారెడ్డి (75)కి ఇద్దరు కుమార్తె లు, కుమారుడు మహిపాల్‌రెడ్డి ఉన్నారు. కొడుకు పోతరాజుపల్లి వద్ద చికెన్ సెంటర్ నిర్వహిస్తూ భార్య కవితతో అక్కడే ఉన్నాడు. గ్రామంలో ఉన్న వ్యవసాయ భూములు అమ్మి, మహిపాల్‌రెడ్డి పేరుతో గజ్వేల్ మండలం పిడిచెడ్‌లో వ్యవసాయ భూమి, యాదగిరిగుట్ట, తూప్రాన్‌లలో ప్లాట్లు కొనుగోలు చేశారు. మహిపాల్‌రెడ్డి, కవిత దంపతుల మధ్య గొడవలు జరగడంతో కొద్దిరోజులు వేరుగా ఉండగా, గ్రామస్థులు, పెద్దలు రాజీ చేయడంతో కలిసిపోయారు. ఆ సమయంలో కొడుకుపై ఉన్న ఆస్తులను కోడలు కవిత తన పేరిట మార్చుకున్నారు. మహిపాల్‌రెడ్డి అనారోగ్యానికి గురికాగా, కోడలు విడిచి వెళ్లిపోయింది. దీంతో మహిపాల్‌రెడ్డి స్వగ్రామానికి వచ్చేయగా, వైద్యానికి కుమార్తె సహాయం చేసింది. మే 1న అతను చనిపోగా కోడలు దహన సంస్కారాలకు కూడా రాలేదు. తనకు ఆరోగ్యం బాగాలేకపోతే కూతురు వైద్యం చేయించినట్లు చంద్రారెడ్డి తెలిపారు. కొడుకుపై ఉన్న ఆస్తులను కోడలు మార్చుకొని, 75ఏళ్ల తన బాగోగులు పట్టించుకోవడంలేదని, వైద్యానికి సహాయం చేయడంలేదని చంద్రారెడ్డి వాపోయారు. కొడుకు వైద్యం కోసం చేసిన ఖర్చుల కోసం ఇంటిని అమ్మితే, కోడలు వచ్చి కబ్జా చేసినట్లు గ్రామస్థులు, చంద్రారెడ్డి తెలిపారు. తనకు భోజనానికి ఇబ్బంది అవుతుందని చంద్రారెడ్డి పేర్కొంటూ, కోడలు పేర ఉన్న తన ఆస్తులను మార్చి, తనకు న్యాయం చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డికి చేసిన వినతిలో కోరారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత
● అక్బర్‌పేట-భూంపల్లిలో 372 క్వింటాళ్లు 8

గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో
పారదర్శకంగా వ్యవహరించాలి
● డీఆర్డీవో పీడీ శ్రీనివాస్ 10



నియామకపత్రం అందజేత

గ్రూప్-2లో రెండో ర్యాంక్ సాధించిన సిద్దిపేట పట్టణానికి చెందిన వడ్లకొండ సచిన్ రిజిస్ట్రేషన్ శాఖలో సబ్‌రిజిస్ట్రార్‌గా ఎంపిక వగా, ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో అలాగే, హుస్నాబాద్‌కు చెందిన మణికంఠేశ్వర్ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా నియామకపత్రం అందుకున్నారు.

- సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి)


స్వచ్ఛబడి జమ్మిచెట్టు వద్ద సేకరించిన దేవతామూర్తుల పటాలు

ప్రతీ ఇంట్లో దేవుడి గదిలో దేవతామూర్తుల చిత్రపటాలు ఉంటాయి. చాలా రోజులుగా ఉండటం వలన అవి పాడయ్యే అవకాశం ఉంటుంది. అలాగే అనుకోకుండా కిందపడి పగిలి పోయిన సందర్భాలు ఉంటాయి. తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు ఎంతో ఇష్టంతో తీసుకొచ్చుకున్న దేవుడి ప్రతిమలు కూడా అనుకోకుండా విరిగిపోవచ్చు. ఇన్ని రోజులు భక్తితో పూజలు నిర్వహించి, దీపారాధన చేసిన వాటిని ఏంచేయాలి ? ఎక్కడ వేయాలి ? అనే సందేహం అందరిలోనూ ఉంటుంది. చాలా మంది ఏదైనా గుడి వద్ద వదిలి వస్తుంటారు. కొందరు నదిలో, చెరువులో వేస్తారు. గాజు, చెక్కతో చేసిన ఫొటోలు నీళ్లలో వేయటం వలన నీటిలోని జలచరాలకు ప్రాణాపాయం జరగవచ్చు. దీంతో పర్యావరణానికి ఎంతో కొంత హానిచేసిన వారమవుతాం. ఈ నేపథ్యంలో సిద్దిపేటలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇలాంటి దేవుడి ఫొటోలు, ప్రతిమలకు శాస్త్రోక్తంగా క్రతువు నిర్వహించి ఉద్వాసన పూజ చేయనున్నారు.

ఉద్వాసన క్రతువు

దేవుడి పాత పటాలకు భక్తితో వీడ్కోలు.. సిద్దిపేటలో వినూత్న కార్యక్రమం

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వినూత్నమైన, పర్యావరణహితమైన కార్యక్రమానికి సిద్దిపేట వేదికవుతుంది. ప్రకృతిని ఇచ్చిన భగవంతుడిని ప్రకృతిలోకి సాగనంపడం అనే అంశంతో పట్టణంలోని 39వ వార్డు కౌన్సిలర్ దీప్తినాగరాజు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వినాయక చవితి, అమ్మవారి నవరాత్రుల సందర్భంగా ఉద్వాసన పూజ చేసి నిమజ్జనంకు తరలిస్తామో అలాగే ప్రతీరోజు పూజలు నిర్వహించిన ఇంట్లోని దేవతామూర్తుల చిత్రపటాలకు ఉద్వాసన క్రతువు ద్వారా భక్తిపూర్వకమైన వీడ్కోలు పలకడంతో పాటుగా పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామంటున్నారు.

21 వరకు సేకరణ.. 22న పూజ

ఇంట్లో పూజకు ఉపయోగించని దేవుడి చిత్రాలు, ప్రతిమలు అంటే పగిలిపోయిన, విరిగిపోయిన వాటిని ఈ నెల 17 నుంచి 21 వరకు సేకరిస్తున్నారు. అంతేకాకుండా ఎవరైనా సరే ఫొటోలను సిద్దిపేట పట్టణంలోని బురుజు దగ్గర ఉన్న స్వచ్ఛ బడిలో ఉన్న జమ్మిచెట్టు వద్దకు తీసుకరావాలని కోరుతున్నారు. ఈ విషయం

మిగతా 10వ పేజీలో


దేవతామూర్తుల పటాలను తీసుకువస్తున్న పట్టణవాసులు

మంచి స్పందన వస్తుంది



భక్తితో పూజించే దేవతామూర్తుల పటాలు ఉపయోగపడని స్థితికి వచ్చేసరికి ఏంచేయాలో తెలియక సజ్జలపైనా, ఆలయాల వద్ద వదిలేస్తాం. వీటికి శాస్త్రోక్తంగా ఉద్వాసన పలికితే అన్ని రకాలుగా మేలు జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని చేపట్టగా, మంచి స్పందన వస్తుంది. కొంత మంది హైదరాబాద్ నుంచి ఫోన్ చేసి ఎలా పంపించాలని అడుగుతున్నారు. స్వచ్ఛ బడిలోని జమ్మిచెట్టు వద్దకు తీసుకరావాలని కోరుతున్నాం. 22న జరిగే ఉద్వాసన పూజలో భాగమవ్వాలి.

- దీప్తినాగరాజు, 39వ వార్డు కౌన్సిలర్, కార్యక్రమ నిర్వాహకులు

సంపూర్ణం

జిల్లాలో బీసీ బంద్ విజయవంతం

- అత్యవసర సేవలు మినహా అన్నీ మూసివేత
- స్వచ్ఛందంగా పాల్గొన్న వర్తక, వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు
- డిపో దాటని ఆర్టీసీ బస్సులు
- బంద్‌కు మద్దతు పలికిన రాజకీయ పార్టీలు
- కొమురవెల్లి, మద్దూరులో ప్రధాని దిష్టిబొమ్మ దహనానికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు

సిద్దిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం జిల్లాలో బంద్ సంపూర్ణంగా కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా అన్నీ ప్రాంతాల్లో బంద్ విజయవంతమైంది. సిద్దిపేటతో పాటు హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల పట్టణాలతో పాటు అన్ని మండల కేంద్రాల్లో బంద్‌ను పాటించారు. అత్యవసర సేవలు మినహా దాదాపు అన్ని రంగాల సంస్థలు స్వచ్ఛందంగా సహకరించాయి. వ్యాపార, వాణిజ్య, హోటళ్లు, సినిమా థియేటర్లు, బ్యాంకులు, పెట్రోల్ బంకులు, చిరువ్యాపారాల దుకాణాలు, విద్యా సంస్థలను స్వచ్ఛందంగా మూసి వేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీలన్నీ బంద్‌కు మద్దతు పలికాయి.

ఎక్కడికక్కడ..

గజ్వేల్, హుస్నాబాద్, సిద్దిపేట పట్టణాల్లోని ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు బయటకు రాకుండా పలు పార్టీల నాయకులు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు బైఠాయించారు. సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి వ్యాపార సంస్థలను మూసివేయించారు. బీజేపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి బంద్ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. కాగా బీఆర్ఎస్ నాయకులు పార్టీ కండువాతో బంద్‌లో పాల్గొనగా, బీసీ నాయకుల సూచన మేరకు నల్ల కండువాలను ధరించి బంద్‌లో పాల్గొన్నారు. పట్టణంలో

మిగతా 10వ పేజీలో


సిద్దిపేట పట్టణంలో దుకాణాలను మూసివేయడంతో బోసిపోయి కనిపిస్తున్న మార్గం


నిర్మానుష్యంగా సిద్దిపేట బస్టాండ్ ప్రాంగణం


సిద్దిపేట ఆర్టీసీ డిపోలోనే నిలిచిపోయిన బస్సులు


సిద్దిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు


హుస్నాబాద్‌లో టైర్ కాల్చి నిరసన తెలుపుతున్న నాయకులు


గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో ఎదుట బస్సులు బయటకు వెళ్లకుండా ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

యువకుడి ప్రాణం తీసిన ఫైనాన్స్ వేధింపులు


ఐరేని మల్లేశం (ఫైల్)

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ వేధింపులు ఒక యువకుడి నిండు ప్రాణాలు బలిగొన్న సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు, త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఐరేని మల్లేశం (30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. 2023లో ఇల్లు కట్టుకునేందుకు సిద్దిపేటకు చెందిన చోళ మండలం ఫైనాన్స్ కంపెనీలో రూ. 7,12,000 అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు సంబంధించి ఈఎంఐ చెల్లిస్తూ వస్తున్నాడు. ఇటీవల రెండు ఈఎంఐలు పెండింగ్‌లో పడటంతో ఐదు రోజుల నుంచి ఫైనాన్స్ కంపెనీ వారు ఫోన్ చేయడం, ఇంటికి రావడం, ఎక్కడికి వెళ్లినా అక్కడి వచ్చి వేధించారు. కొంత ఇబ్బంది ఉంది డబ్బులు రాగానే చెల్లిస్తాం అని చెప్పినప్పటికీ వినకుండా ఈ నెల 16న సాయంత్రం ఫైనాన్స్‌కు చెందిన ఇద్దరు ఎల్లుపల్లి గ్రామానికి వచ్చి ఇంటి వద్ద కూర్చొని 'డబ్బులు ఇస్తేనే వెళ్తాం.. లేదంటే నువ్వు చచ్చిన వెళ్లం' అని చెప్పడంతో మనస్తాపం చెందిన యువకుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయి తమ వ్యవసాయ బావి శివారులో ఉరివేసుకున్నాడు. గతంలో మిస్టర్ టీ అనే పేరుతో టీ స్టాల్ పెట్టి కొంత ఆర్థికంగా ఇబ్బంది అవడంతో ఫైనాన్స్ కట్టడం ఆలస్యమైందని ఎంత చెప్పున్నా వినకుండా ఫైనాన్స్ వారు అనేక రకాలుగా మానసికంగా హింస పెట్టడం వలన మనస్తాపంతో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మల్లేశం తండ్రి దుర్గయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫైనాన్స్ కంపెనీపై కూడా సంబంధిత శాఖకు ఫిర్యాదు చేసినట్లు బంధువులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

రామన్నకు అంతిమ వీడ్కోలు

- కన్నీటి పర్యంతమైన తల్లిదండ్రులు
- కడసారిచూపునకు తరలివచ్చిన జనం
- ప్రజాసంఘాల నేతలు, కవులు, కళాకారుల నివాళి

కోహెడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు నేత కాతా రాంచంద్రారెడ్డి అలియాస్ వికల్ప అలియాస్ రాజు దాదా అంత్యక్రియలు శనివారం కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామంలో నిర్వహించారు. గత నెల 22వ తేదీన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా అంబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రాంచంద్రారెడ్డి మృతిచెందారు. బూటకపు ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తు చేయాలని ఆయన భార్య మాళవి, కుమారుడు రాజాచంద్ర ఛత్తీస్‌గఢ్ హైకోర్టు, సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, తీర్పు కోసం ఇన్నాళ్లుగా అంత్యక్రియలకు ఆలస్యమైంది. శనివారం ఉదయం 9 గంటలకు రాంచంద్రారెడ్డి భౌతికకాయం స్వగ్రామానికి చేరుకున్నది. మధ్యాహ్నం 12 గంటల దాకా సందర్శనార్థం ఇంటి వద్ద ఉంచారు. అజ్ఞాతంలోకి వెళ్లి 40 సంవత్సరాల తరువాత శవమై వచ్చిన కొడుకును చూసి ఆయన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు బోరున ఏడ్చారు. రాంచంద్రారెడ్డి కడసారి చూపు కోసం తీగలకుంటపల్లితో పాటు ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కవులు, కళాకారులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. అనంతరం అంతిమ యాత్ర కళాకారుల విప్లవ గీతాల మధ్య దాదాపు ఐదు గంటల పాటు సాగింది. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్, కవి నందిని సిధారెడ్డి, గాదె ఇన్నయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్లవ సంఘం నాయకుడు వరవరరావు పంపించిన సందేశాన్ని వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పు దృష్ట్యా రీపోస్టు మార్టంకు అనుకూలంగా రాంచంద్రారెడ్డి మృతదేహాన్ని ఖననం చేశారు. రాంచంద్రారెడ్డి అంత్యక్రియల్లో మఫ్టీలో పాల్గొన్న పోలీసులు వీడియోలు, ఫొటోలు తీశారు.


నివాళి అర్పిస్తున్న దేశపతి శ్రీనివాస్, నందిని సిధారెడ్డి, దేవీప్రసాద్ తదితరులు

కిక్కు తగ్గింది

- ముగిసిన వైన్స్ టెండర్ల దరఖాస్తులు
- మొత్తం దరఖాస్తులు 2,585.. ఆదాయం రూ.77.55 కోట్లు
- గతంతో పోలిస్తే పడిపోయిన ఆదాయం

సిద్దిపేట క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లాలో ఆబ్కారీ శాఖకు మద్యం దరఖాస్తుల ద్వారా భారీగా ఆదాయం సమకూరినప్పటికీ గతంతో పోలిస్తే తగ్గింది. మద్యం దుకాణానికి రూ.3 లక్షల ఫీజు నిర్ణయించగా, దరఖాస్తుల స్వీకరణ గత నెల 26 నుంచి ప్రారంభమైంది. ఆరంభంలో దరఖాస్తులు అంతంతమాత్రంగానే రాగా, చివరి రెండు రోజుల్లో భారీగా వచ్చాయి. జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు ఎస్సీ, ఎస్టీ, గౌడ కులాలకు 25, జనరల్‌కు 68 కేటాయించారు. ఆయా మద్యం దుకాణాల నిర్వహణ కోసం జిల్లాలో శుక్రవారం ఒక్కరోజే 689 దరఖాస్తులు రాగా, చివరిరోజైన శనివారం రాత్రి 10 గంటల వరకు అంతకుమించి 1335 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో జిల్లాలో మొత్తం దరఖాస్తుల 2585 వచ్చాయి. ఆబ్కారీ శాఖకు దరఖాస్తుల ఫీజుల రూపంలో రూ.77.55 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లాలో 2023-25 వైన్స్ దరఖాస్తులతో పోలిస్తే ఇది తక్కువే. రెండేళ్ల క్రితం 93 వైన్స్‌లకు రూ.2 లక్షల దరఖాస్తు ఫీజుతో 4,116 దరఖాస్తులు రాగా, ఎక్సైజ్ శాఖకు రూ.83.32 కోట్లు ఆదాయం వచ్చింది. ఈసారి రూ.5.77 కోట్ల ఆదాయం తగ్గింది. అధికారులు ఈనెల 23వ తేదీన లాటరీ ద్వారా వైన్స్ షాప్‌లను కేటాయించనున్నారు.

ఎక్సైజ్ శాఖ పరిధిలో వచ్చిన దరఖాస్తులు	
సిద్దిపేట	752
గజ్వేల్	738
హుస్నాబాద్	489
చేర్యాల	391
మిరుదొడ్డి	215






దివ్వెలు.. బొమ్మలు

సిద్దిపేట పట్టణంలోని గాంధీ సర్కిల్, మెదక్ రోడ్, రైతుబజార్, హౌజింగ్‌బోర్డు వద్ద దీపావళి దివ్వెల విక్రయిదారులతో బిజీబిజీగా మారాయి. వివిధ ఆకృతుల్లోని దివ్వెలు ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు అమ్మవారి, దేవుళ్ల బొమ్మలు, వివిధ రకాల డెకరేషన్ వస్తువులు అమ్ముతుండగా మహిళలు ఉత్సాహంగా కొనుగోలు చేస్తూ కనిపించారు.

- సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి)





విజయవంతంగా బీసీ బంద్



చిన్నకోడూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



నిర్మానుష్యంగా మారిన హుస్నాబాద్ బస్టాండ్



అక్కన్నపేటలో బందును నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు



తొగుట ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయించి బయటకు వస్తున్న బీసీ సంఘాల నాయకులు



హనుమకొండ- సిద్దిపేట రహదారి లోని బద్దిపడగ బస్ స్టేజీ వద్ద రాస్తారోకో చేస్తున్న నాయకులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని బీసీ జేఏసీ చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా సాగింది. నాయకులు, కార్యకర్తలు బస్ డిపోల ఎదుట ధర్నాలు చేశారు. పార్టీల నాయకులు ర్యాలీలు నిర్వహిస్తూ పలు చోట్ల రాస్తారోకోలు, టైర్లను కాల్చుతూ, ఆటపాటలతో నిరసన తెలిపారు. బంద్‌తో పట్టణంలోని ప్రధాన రహదారులు, బస్టాండ్ నిర్మానుష్యంగా మారాయి.

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేట బస్ డిపో వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

చోరీ కేసులో ఇరువురి అరెస్ట్

చేర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో తాళంవేసి ఉన్న ఓ ఇంట్లో కొద్దిరోజులక్రితం చోరీకి పాల్పడిన ఇరువురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఈమేరకు శనివారం సాయంత్రం చేర్యాల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేక రుల సమావేశంలో సీఐ ఎల్ శ్రీను మాట్లాడుతూ.. నిందితుల వివరాలు వెల్లడించారు. ముస్త్యాల గ్రామానికి చెందిన కెంచు శివశంకర్, సాల్లూరి సిద్దిరాములు ఈనెల 4వతేదీన అదే గ్రామానికి చెందిన తరిగొప్పుల నర్సింహులు ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు, అపహరించారని తెలిపారు. ఈవిషయమై కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన క్రమంలో నిందితులను పట్టణ శివారులోని ఎల్లమ్మ దేవాలయ సమీపంలో ఇటీవల పట్టుకుని విచారించామన్నారు. నిందుతుల నుంచి మూడున్నర తులాల బంగారు నెక్లెస్, 25తులాల వెండి పట్టీలు, కేటీఎం బైక్, 2సెల్‌ఫోన్లు రికవరీ చేశామని, ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

కొమురవెల్లి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలంలోని రాజీవ్ రహదారికి సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో ఎకనామిక్స్ సబ్జెక్ట్ బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ నీరజ ఓక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఏకనామిక్స్ పూర్తి చేసినవారు అర్హులన్నారు.దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25వ తేది వరకు అవకాశం ఉందని ఆసక్తి కలవారు పూర్తి వివరాల కోసం పాఠశాలలో సందర్శించాలన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

గజ్వేల్ రూరల్ అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న సోషల్, హిందీ ఇంగ్లిష్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని టీపీటీఎఫ్ గజ్వేల్ మండల అధ్యక్షుడు తాళ్లనాగరాజు కోరారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులకు పూర్తి స్థాయి న్యాయం జరగలంటే ప్రభుత్వం వెంటనే ఈ 3 పోస్టులను భర్తీ చేయాలని లేదా డిప్యూటేటన్ ఇవ్వాలి అని వారు కోరారు.ఈ కార్యక్రమం లో హెచ్ఎం వేణుగోపాల్ రావు, ఉపాధ్యాయ బృందం మహేందర్ రెడ్డి, శ్యామల, గీతాంజలి, నవనీత తదితరులు పాల్గొన్నారు

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

గజ్వేల్ రూరల్ అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడకండ్ల గ్రామానికి చెందిన తుప్పతి వికాస్‌కు సీఎం సహాయ నిధి నుంచి రూ. 24500 చెక్కు మంజురైంది మంజురైన చెక్కును బాధిత కుటుంబానికి గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్, తాజా మాజీ ఎంపీటీసీ అశోక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు

ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శించిన ఎంపీ ఈటల

చిన్నకోడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) :చిన్నకోడూరు మండలం గంగాపూర్‌లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య (85) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అంతకు ముందు ఆయన విజ్జయ్య ఫ్లెక్సీకి పూలు చల్లి నివాళులార్పించారు. ఆయన వెంట దిశ కమిటీ జిల్లా సభ్యురాలు వనజ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ తదితరులు పాల్గొన్నాడు.

గురుకుల స్పాట్ అడ్మిషన్లు పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

సిద్దిపేట కల్చరల్, /చేర్యాల అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్త సాంఘీక,సంక్షేమ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం చేర్యాల పట్టణంలోని గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, జోనల్ అధికారి ప్రత్యూష అడ్మిషన్ల ప్రక్రియ పర్యవేక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెదలాలని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని వారి కలలను సాకారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గురుకులాల జిల్లా సమన్వయ అధికారి పోలోజు నరసింహ్మాచారి పాల్గొన్నారు.



దీపావళి సంబరాల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

దీపావళి సంబరాల్లో..

సిద్దిపేట జిల్లా సంక్షేమ శాఖ వారి అధ్వర్యంలో బాలసదనం చిల్డ్రన్ హోమ్, శిశుగృహలో నిర్వహించిన దీపావళి సంబరాల్లో జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్ పాల్గొన్నారు. బాలసదనం, శిశుగృహలోని పిల్లలతో కలిసి దీపావళి సంబరాలు చేసుకున్నారు. పిల్లలతో దీపారాధన, దీపాలంకరణ చేశారు. పిల్లలతో ఆనందంగా టపాసులు కాల్చారు. శిశుగృహలోని చిన్న పిల్లలకు బొమ్మలు బహుమతిగా అందించారు. ఈ సంబరాలలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ మమత, చిల్డ్రన్ హోమ్ సూపరిడెంట్ ప్రతిభ, మేనేజర్ రాజు, సామాజిక కార్యకర్త రాజారాం పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయం

● బర్దిపూర్ పీఠాధిపతులు



మాట్లాడుతున్న బర్దిపూర్ పీఠాధిపతులు అవధూతగిరి మహరాజ్

కొమురవెల్లి, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని శనివారం సంగారెడ్డి జిల్లా బర్దిపూర్ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్యశిఖామణి అవధూతగిరి మహరాజ్ సందర్శించారు. ఆలయ అర్చకులు, అధికారులు వేదమంత్రాల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ.. సనాతన ధర్మం అంటేనే విశ్వం ఉనికికి మూలం, శాశ్వతమైన విధి అనీ, కాలాతీతమైన సత్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. పీఠాధిపతిని ఆలయ అర్చకులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, స్థానాచార్య మల్లయ్య, ఆలయ అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందజేత

మిరుదొడ్డి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మిరుదొడ్డి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సామాజిక సమరసత వేదిక , యూత్‌ఫర్‌సేవా, చేతన గ్రామీణ సేవా సమితి అందె ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు బ్యాగులను, పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో చేతన గ్రామీణ సేవా సమితి సభ్యులు సంతోష్, రాములు, సాయికుమార్ తదితరులున్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పిడిచేడులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సూరారం కిషన్(28)కు భార్య జ్యోతి, కూతురు మనుశ్రీ ఉన్నారు. కిషన్ రెండేళ్లుగా ఎస్ఎల్ఈ (సిస్టమిక్ లూప్స్) అనే వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అతడి భార్య పాపను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కిషన్ సోమవారం పురుగుల మందు తాగాడు, విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించంగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దుబ్బాక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేక ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన జమున గారి ప్రవీణ్ కుమార్ (33) వ్యవసాయం చేయడంతో పాటు వరి కోత యంత్రం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలం క్రితం దాదాపు రూ. 8 లక్షల వరకు అప్పు చేశాడు. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వారి పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు ప్రవీణ్ భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు దుబ్బాక ఎస్సై కీర్తిరాజు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి సహాయం

చేర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుబ్బాక సిద్దవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించడం పట్ల బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ శనివారం సంతాపం వ్యక్తంచేశారు. మృతురాలి కుటుంబసభ్యులకు సహాయంఅందజేశారు.

దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ సైకిల్ అందజేత



బైలంపూర్‌లో దివ్యాంగుడులకు ఎలక్ట్రిక్ సైకిల్ అందించిన కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి

ములుగు, అక్టోబరు 18 ఆంధ్రజ్యోతి. బైలంపూర్ గ్రామంలో వికలాంగ బాలుడికి ఎలక్ట్రిక్ సైకిల్ అందించడం జరిగిందని పీర్జాదిగూడ కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం ములుగు మండలం బైలంపూర్ గ్రామంలో తలారి లక్ష్మి మహేష్ దంపతుల కుమారుడైన శ్రీకాంత్‌కు కొద్ది రోజుల క్రితం నరాల బలహీనత వల్ల కాళ్లు చేతులు చచ్చుపడ్డాయి కొద్దిరోజులుగా ఎలక్ట్రిక్ సైకిల్ పై తిరిగేవాడు ఇటీవల ఆ వాహనం చెడిపోవడంతో బయటకు వెళ్లలేక పోయాడు విషయం తెలుసుకున్న మధుసూదన్ రెడ్డి హైదరాబాదులో స్థిరపడడం కాకుండా ఫిర్జాదిగూడ కార్పొరేటర్‌గా ఉన్నాడు. అయన సొంత డబ్బులతో శ్రీకాంత్‌కు వాహనాన్ని అందజేశారు. ఆయన వెంట మహేష్ యాదవ్‌తో పాటు గ్రామస్తులతో పాటు తదితరులు ఉన్నారు.

ప్రమాదంలో గాయపడిన సీసీవోకు ఆర్థిక సాయం

రాయపోల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలోని మండల వనరుల కేంద్రానికి చెందిన కంప్యూటర్ ఆపరేటర్ రఘురాములు బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. రాయపోల్ ఎంఈఓ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు లక్షకు పైగా డబ్బులు పోగుచేసి శనివారం బాధితునికి అంద జేశారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు

గజ్వేల్ రూరల్ అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి బీజేపీ నాయకులు కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరు

తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి రాజిరెడ్డి అన్నారు, మండల పరిధిలోని పిలుట్ల గ్రామానికి చెందిన పదిమంది బిజెపి కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు బుర్ర మురళి గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి సమీక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. రాజిరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శంకర్,మధు, తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ కమిటీ నూతన కార్యవర్గం

చేర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చేర్యాల డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్షుడుగా మంతెన చంద్రారెడ్డి, గౌరవ అధ్యక్షుడుగా కద్దూరి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బేజాడి అంజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఉప్పల అశోక్‌రాజు, కోశాధికారిగా మలిపెద్ది బాలలింగం, సహాయ కార్యదర్శిగా గదరాజు రాజు, తాడూరి లింగం, సలహాదారులుగా పిల్లి ఆనంద్ ఎన్నికయ్యారు.

సిద్దిపేట డీపీవోగా జి.వినోద్‌కుమార్

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి):సిద్దిపేట జిల్లా డీపీవోగా గ్రూప్ వన్ ఆఫీసర్ జి.వినోద్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు డీపీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న దేవికా దేవికి ఇంకా ఎక్కడ పోస్టింగు ఇవ్వలేదని సమాచారం.

ఉద్వాసన క్రతువు

(9వ పేజీ తరువాయి)

తెలిసిన వారు ఇప్పటికే వారి ఇళ్లలో ఉన్న ఫొటోలను తీసుకవచ్చి జమ్మి చెట్టు వద్ద ఉంచారు. ఇలా ఈ నెల 21 వరకు అవకాశం కల్పించారు. ఆ తర్వాత 22న బుధవారం సేకరించిన ఫొటోలన్నింటికి వేద పండితులతో శాస్త్రోక్తంగా ఉద్వాసన పూజ నిర్వహించనున్నారు. అప్పుడు పూజలందుకున్న ఫొటోల్లోని శక్తిపోయి వస్తురూపకంగా మారుతుందని, అప్పుడు ఆ ఫొటోల గ్లాసును, ఉడ్‌ను, మేకులను వేరుచేసి రీసైక్లింగ్‌కు పంపించనున్నారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు పట్టణవాసులు రావాలని నిర్వాహకులు కోరుతున్నారు. తీర్థ ప్రసాదాలను అందజేయనున్నారు. అలాగే, పూజ అనంతరం ఫొటోలను విడిభాగాలు చేసేందుకు వలంటీర్లుగా పాల్గొనే వారు 22న స్వచ్ఛ బడికి రావాలని కోరుతున్నారు.

ఈ పరిష్కారం బాగుంది



చాలా మందికి ఇలాంటి సంకట పరిస్థితి ఎదురవుతుంది. అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించిన దేవతామూర్తుల చిత్రపటాలను ఏంచేయలో తెలియదు. ఆలయాల వద్ద వదిలేస్తుంటాం. కానీ మనుసులో కొంచెం బాధ అనిపిస్తుంది. ఇన్నిరోజులు పూజలు చేసిన వాటిని అలా అక్కడ విడిచిపెట్టడం పాపమేమో అని భయమూ ఉంటుంది. అలాంటి వాటికి ఈ ఉద్వాసన పూజ ద్వారా పరిష్కారం చూపడం బాగుంది. ఇలాంటి కార్యక్రమాలు అంతటా తరచుగా నిర్వహించాలి.

- చిలుముల సరిత, పటేల్‌పుర సిద్దిపేట

20 ఏళ్ల నాటి ఫొటోలు ఏం చేయాలో తెలియలేదు



20 ఏళ్ల కిందట అయ్యప్ప మాలాధారణ తీసుకున్నాను. ఆ సమయంలోని స్వామి వారి ప్రతిమలు, ఫొటోలు పాతపడ్డాయి. వాటిని ఏంచేయాలో తెలియలేదు. ఉద్వాసన పూజ కార్యక్రమం గురించి తెలిసింది. వెంటనే వాటిని తీసుకవచ్చి పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బురుజు సమీపంలోని స్వచ్ఛ బడిలోని జమ్మిచెట్టు వద్ద అందజేశాను. ఉద్వాసన పూజ చేయటం వలన శాస్త్రోక్తంగా ప్రక్రియ పూర్తవుతుంది.

- సంతోష్ కుమార్, కంచరి బజార్ సిద్దిపేట

ముందస్తు దీపావళి వేడుకలు

గజ్వేల్ రూరల్ అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ పురస్కరించుకుని గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామం లోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయిలు మదునాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిలు మదునాల శ్రీనివాస్ దీపావళి పండుగ విశిష్టతను అలగే పండుగ సందర్భంగా పటాకుల కాల్చే టప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన బాల్‌నర్సాగౌడ్, లక్ష్మణ్‌లు మృతిచెందారు. శనివారం ఈవిషయాన్ని తెలుసుకున్న రాష్ట్రఎస్సీఎస్టీకమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బాధిత కుటుంబాలను పరామర్శించారు.

మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు

● ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలి..

● పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): కష్టించి పండించిన పంటను మధ్యవర్తుల చేతిలో పెట్టి రైతులు మోసపోవద్దని నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మిట్టపల్లి పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ అన్నారు. శనివారం మిట్టపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన ప్రకారం రైతులు వడలను ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శంకర్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు జేపీ యాదవ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణం

(9వ పేజీ తరువాయి)

నిర్వహించిన బంద్ ఫర్ జస్టిస్ కార్యక్రమ వేదికపై నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. హుస్నాబాద్‌లో నాయకులు ర్యాలీలు నిర్వహిస్తూ పలు చోట్ల రాస్తారోకోలు, టైర్లను కాల్చుతూ, ఆటపాటలతో నిరసన తెలిపారు. గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ పరిధిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, అక్కడక్కడా తెరచి ఉన్న దుకాణాలను మూసి వేయించారు. నంగునూరు మండలంలో హనుమకొండ - సిద్దిపేట రహదారిపై బద్దిపడగ గ్రామస్థులు రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. చేర్యాలలో అంగడిబజారు వద్ద జనగామ - సిద్దిపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. సీపీఎం నాయకులు ర్యాలీ నిర్వహించారు. కొమురవెల్లి, మద్దూరు మండల కేంద్రాల్లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు సీపీఎం నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

ప్రయాణికుల అవస్థలు

ఆర్టీసీ బస్సులన్నీ డిపోలకే పరిమితమవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడూ ఎలాంటి హోటళ్లు లేకపోవడంతో బస్టాండ్‌లో వచ్చిన వారు ఆకలితో అలమటించారు. సిద్దిపేటలో నాయకుల కోసం మధ్యాహ్నం ఏర్పాటు చేస్తున్న భోజనాన్ని ప్రయాణికులకు అందించారు. దీపాలవళి పండుగ నేపథ్యంలో వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ఉండటంతో సొంత గ్రామానికి వెళ్దామనుకున్న వారు బస్సులు లేక పోవడంతో ఆటోలలో తరలివెళ్లారు. కొందరు ప్రైవేట్ వాహనదారులు రెండింతలు, మూడింతలు వసూలు చేశారు. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వరకు ఒక్కొక్కరి నుంచి రూ.400కుపైగా దండుకున్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పనులపై పారదర్శకంగా వ్యవహరించాలి

● డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకంలో చేపడుతున్న ఉపాధి పనుల్లో పారదర్శంగా వ్యవహరించాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో పనులలో రికార్డులు సరిగా మేయింటన్స్ చేయని వారిపై 16000 ఫైన్ విధించినట్లు పేర్కొన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, పీల్డ్‌అసిస్టెంట్లు పనులలో ఎలాంటి లోపాలు లేకుండా చేయడం పట్ల అభినందించారు. వచ్చే సామాజిక తనిఖీ నాటికి ఎలాంటి చిన్న పొరపాట్లు లేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎంపీడీవో రమేష్, సంతోష్‌రెడ్డి, ఆరీఫ్, సతీష్, అంజిగౌడ్, ఏపీవో పద్మ తదితరులు ఉన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

జగదేవ్ పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లిరాజపేట గ్రామంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి వసంతరావు హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ వాన కాలంలో అధిక వర్షాల వలన పత్తి పంట దిగుబడి ఆశాజనకంగా లేక రైతులు యాసాంగిలో శనగ పంట వైపు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.